# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 17-08-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో భాగంగా ఈరోజు ప్రధానమంత్రి నరేంద్రమోదీతో సమాశమయ్యారు.
- గ్రామీణ భారతం అభివృద్ధి చెందినప్పుడే దేశం ప్రగతి పధంలో సాగుతుందని భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ పేర్కొన్నారు.
- రాష్ట్రంలో చిన్న విమానాశ్రయాలను అభివృద్ధి చేస్తామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు అన్నారు.
- ఉద్యోగుల బదిలీలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు మార్గదర్శకాలు జారీ చేసింది.
- రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా ఈరోజు విశాఖ జిల్లాలో పర్యటించారు.

======================

రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కొద్దిసేపటి క్రితం ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలను ప్రధానమంత్రి దృష్టికి ఆయన తీసుకువచ్చారు. అంతకుముందు ముఖ్యమంత్రి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడుతో కలిసి రాష్ట్రంలో విమానాశ్రయాల అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. కాగా ప్రధానమంత్రితో భేటీ అనంతరం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలతో ముఖ్యమంత్రి సమావేశమువుతారని అధికార వర్గాలు తెలిపాయి.

======================

గ్రామీణ భారతం అభివృద్ధి చెందినప్పుడే దేశం ప్రగతి పధంలో సాగుతుందని భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ అన్నారు. ఈ  రోజు ఆయన పొట్టి శ్రీరాములు జిల్లా నెల్లూరులో పర్యటించారు. ఈ సందర్భంగా స్వర్ణభారత్ ట్రస్టు 23వ

వార్షికోత్సవ సభలో పూర్వ ఉప రాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు, రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ లతో కలసి ఆయన పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభలో ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల ప్రగతికి అధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని, అపుడే స్వాతంత్ర్య సమరయోధుల కలలు నెరవేరుతాయని అన్నారు.

(వాయిస్ 33 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో మొత్తం 12 శాఖలలో ఉద్యోగుల బదిలీలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఈ రోజు మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ నెల 19 నుంచి 31వ తేదీ వరకు ఉద్యోగుల బదిలీలపై ఉన్న నిషేధాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ప్రజా సంబంధిత సేవల్లో ఉండే శాఖల్లో మాత్రమే బదిలీలకు అనుమతించామని ప్రభుత్వం ఈ ఉత్తర్వులలో పేర్కొంది. ఈ నెలాఖరు లోగా ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. కాగా, ఎక్సైజ్ శాఖలో బదిలీలకు సెప్టెంబరు 5 నుంచి 15వ తేదీ వరకు అనుమతిస్తూ ఉత్తర్వులను జారీ చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్ లో 7 విమానాశ్రయాలను 14 చేస్తామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు. రాష్ట్రాన్ని లాజిస్టిక్ హబ్ గా మార్చాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఢిల్లీలో ఈ రోజు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలసి కేంద్ర మంత్రి సమీక్ష నిర్వహించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో చిన్న విమానాశ్రయాలను అభివృద్ధి చేసే ఆలోచనలు చేస్తున్నామని, 500 నుంచి 700 ఎకరాల భూమి ఉంటే చిన్న విమానాశ్రయాలను సైతం అభివృద్ధి చేయవచ్చునని తెలిపారు. రాష్ట్రంలో నాగార్జున సాగర్, కుప్పం, ఒంగోలులోని దిగదుర్తి, తుని-అన్నవరం, తాడేపల్లి గూడెంలలో కొత్త విమానాశ్రయాల నిర్మాణాలకు అవకాశాలను పరిశీలిస్తామని కేంద్ర మంత్రి పేర్కొంటూ..

(వాయిస్ 32 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా విశాఖ జిల్లాలోని పలు ప్రాంతాలలో ఈ రోజు పర్యటించారు. స్థానిక ప్రభుత్వ భూములతో పాటు ఎర్రమట్టిదిబ్బల్లో జరిపిన తవ్వకాల ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. రెవెన్యూ పరమైన అంశాలపై పరిశీలన జరిపారు. ఆయన వెంట జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఇతర అధికారులు ఉన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

విజయనగరాన్ని క్రీడా హబ్ గా తీర్చిదిద్దుతామని రాష్ట్ర సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. విజయనగరంలోని స్థానిక ఇండోర్ స్టేడియంలో సీనియర్ స్త్రీ, పురుష బ్యాడ్మింటన్ పోటీలను శాసనసభ్యులు కళా వెంకటరావు, పూసపాటి అతిధి విజయలక్ష్మి గజపతిరాజు, శాసనమండలి సభ్యులు పెనుమత్స సురేష్ బాబుతో కలిసి మంత్రి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విజయనగరం జిల్లా కేంద్రంలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు, క్రమశిక్షణ, పోటీతత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. విజయనగరం జిల్లా కేంద్రంలో మూతపడిన క్రీడా పాఠశాలను తెరిపించే ప్రయత్నం జరుగుతుందని తెలిపారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

అరుకు అందాలు అద్భుతంగా ఉన్నాయని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ జెకె మహేశ్వరి కొనియాడారు. ఈరోజు జస్టిస్ జేకే మహేశ్వరి దంపతులు అరకులోయలో పర్యటించారు. రైలులో అరకు చేరుకున్న జస్టిస్ దంపతులకు అల్లూరి సీతారామరాజు జిల్లా సంయుక్త కలెక్టర్ ఎంజె అభిషేక్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ స్వాగతం పలికారు. ముందుగా రైల్వే అతిథి గృహానికి చేరుకున్న జస్టిస్ దంపతులు గిరిజన మ్యూజియం సందర్శించి గిరిజన సంస్కృతి సంప్రదాయాలను గురించి తెలుసుకున్నారు. అనంతరం పెదలబుడు పంచాయతీలోని గిరి గ్రామదర్శిని సందర్శించారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా ప్రిన్సిపల్ జడ్జి ఆలపాటి గిరిధర్, పోక్సో కోర్టు జడ్జి జి. ఆనంది తదితరులు పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

తుంగభద్ర డ్యాంలో విరిగి కొట్టుకుపోయిన 19వ గేటు స్థానంలో రెండో ఎలిమెంట్‌ను ఈ రోజు అమర్చారు. సాంకేతిక నిపుణుల బృందం పర్యవేక్షణలో సాఫ్ట్‌లాగ్ గేటు ఏర్పాటు పనులు శరవేగంగా జరుగుతున్నాయని సంబంధిత అధికారులు తెలిపారు. కొట్టుకుపోయిన 19వ గేటు వద్ద సాంకేతిక నిపుణుల బృందం 45 నిమిషాల్లో రెండో ఎలిమెంట్‌ను విజయవంతంగా అమర్చిందని వెల్లడించారు. ఈ రోజే మిగిలిన ఎలిమెంట్‌ను కూడా అమర్చనున్నారని తెలిపారు. దీంతో పది అడుగుల మేర గేటు నుంచి నీటి వృథాకు అడ్డుకట్ట వేయొచ్చని అధికారులు తెలియజేశారు. కాగా స్టాప్ లాగ్ గేటు ఏర్పాటు అమరికను విజయవంతంగా పూర్తి చేయడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేరళ తమిళనాడు అంతర్భాగం మీదుగా కొమొరిన్ ప్రాంతం వరకు సగటు సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల అవర్తనం విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని పేర్కొంది. అలాగే భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. అలాగే, దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాలలో తేలికపాటి నుండి మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

చిత్తూరు జిల్లాకు ఎలక్ట్రానిక్ పరిశ్రమలు రానున్నాయని చిత్తూరు లోక్ సభ సభ్యులు దగ్గుమల్ల ప్రసాదరావు తెలిపారు. చిత్తూరులో ఈ రోజు పార్టీ కార్యాలయంలో పాత్రికేయులతో మాట్లాడుతూ.... కేంద్ర ప్రభుత్వం నూతన పరిశ్రమల కోసం బడ్జెట్ లో అధిక నిధులు కేటాయించిందని గుర్తు చేశారు. దీంతో చిత్తూరు - పలమనేరు రహదారిలో ఎలక్ట్రానిక్ హబ్ ఏర్పాటుకు మార్గం సుగుమమైందన్నారు. నూతన పరిశ్రమల ఏర్పాటు వల్ల వందలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ప్రసాదరావు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

కలకత్తాలోని ఆర్, జి, కర్ వైద్య కళాశాల ఆసుపత్రిలో జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం, హత్య ఘటనపై రాష్ట్రంలో ఈ రోజు నిరసనలు చేపట్టారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో వైద్యులు ఇతర సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ర్యాలీ చేపట్టారు. బాపట్ల, చీరాల ప్రాంతాలలో వైద్యులు, వైద్య సిబ్బంది పట్టణంలో ప్ల కార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కాగా వైద్యురాలిపై

అత్యాచారం, హత్యను ఖండిస్తూ.. ఈ రోజు ఉదయం 6 గంటల నుండి 24 గంటల పాటు అత్యవసర సేవలు మినహా అన్ని వైద్యసేవలను నిలిపివేశారు.

========================

కోల్‌కతాలో జరిగిన వైద్య విద్యార్థిని హత్యాచార ఘటనపైన సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించారు. బాధితురాలికి సత్వర న్యాయం జరగాలని మంత్రి పేర్కొన్నారు.

========================

విశాఖపట్నానికి చెందిన ప్రముఖ కవి, నవలా రచయిత డాక్టర్ బండి సత్యనారాయణకు రాజమహేంద్రవరంలోని ఫిలాంత్రోఫిక్ సొసైటీ ప్రజ్ఞశ్రీ బిరుదును ప్రదానం చేయనున్నారని సొసైటీ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. బండి సత్యనారాయణ ఇప్పటి వరకూ 20 గ్రంథాలను రచించారు. గౌతమ బుద్ధుని జీవితం మీద నిర్వాణ పేరుతో నవలను రాశారు.

========================

తిరుమలలో ఈ రోజు శ్రీ వేంకటేశ్వర స్వామి వారి సర్వదర్శనానికి 18 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు తెలిపారు. కాగా, నిన్న స్వామి వారిని 62 వేల 625 మంది భక్తులు దర్శించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం 3.63 కోట్ల రూపాయలు లభించినట్లుగా అధికారులు పేర్కొన్నారు.

========================
========================